సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 28 । జూలై । 2023



పక్కా ప్రణాళికతోనే చోరీ

నార్కట్‌పల్లి శివారులో ఓ హోటల్ వద్ద ప్రైవేట్ బస్సులో రూ.28లక్షలు చోరీ పక్కా ప్రణాళికతోనే జరిగినట్టు తెలుస్తోంది. - 8లో



ప్రపంచానికి చాటిచెబుతా

బుద్ధవనం ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటి చెబుతానని బాలీవుడ్ నటుడు గగన్‌మాలిక్ అన్నారు. - 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 25/25°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు

- కలెక్టర్ వెంకట్రావు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ వెంకట్రావు తెలిపారు. గురువారం ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామంలో అయ్యవారికుంట చెరువు కాలువ తెగి నీటి ప్రవాహం గ్రామంలోకి రావడంతో నీట మునిగిన నివాస ప్రాంతాలను సందర్శించి మాట్లాడారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నష్టపోయిన వారికి తగిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కాలువ తెగిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాలనీకి వెళ్లే బ్రిడ్జి దగ్గర కల్వర్టు నిర్మాణం చేసినట్లయితే నేరుగా శంభుని చెరువుకు నీరు వెళ్తాయని స్థానికులు తెలిపారు. అధికారులతో సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ పుష్ప, ఎంపీడీఓ మల్సూర్ నాయక్, డి. నగేష్, రామారావు, లింగ నాయక్, సంజీవ, స్థానిక సర్పంచ్ మల్లయ్య, షమ్మి పాల్గొన్నారు.

మంత్రి జగదీష్‌రెడ్డిని కలిసిన అదనపు కలెక్టర్



మంత్రి జగదీష్‌రెడ్డిని కలిసి పూలబొకే అందజేస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

సూర్యాపేట: జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డిని గురువారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పూల బొకే అందజేశారు. ఆమెకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. విధుల నిర్వహణలో సమస్యలను పరిష్కరించి ప్రజల మెప్పు పొందాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

వర్షాలు తగ్గేవరకు ఇళ్లకు వెళ్లండి



అర్వపల్లిలో జలమయమైన కేజీబీవీని పరిశీలిస్తున్న డీఈఓ అశోక్

అర్వపల్లి: వర్షాలు తగ్గే వరకు అర్వపల్లి కేజీబీవీ విద్యార్థినులు ఇళ్లకు వెళ్లాలని డీఈఓ అశోక్ సూచించారు. అర్వపల్లిలో జలమయమైన కేజీబీవీని డీఈఓ అశోక్ గురువారం పరిశీలించారు. బాలికలతో మాట్లాడారు. బాలికలను వారి స్వగ్రామాలకు పంపించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రామారావు నాయక్, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంఈఓ బాలునాయక్, ఎస్ఓ నాగరాణి, సర్పంచ్ బైరబోయిన సునితారామలింగయ్య, వీఆర్ఏలు పి.శ్రీనివాస్, ఎన్.విజయ్, సీహెచ్. వీరయ్య, ఎన్.వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

కోదాడరూరల్ : సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందని జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం కోదాడ మండలం గుడిబండలోని పల్లెదవాఖానాను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. వాతావరణంలో వస్తున్న మార్పులు శరీరంపై ప్రభావం చూపిస్తాయని నీరు, ఆహార సంబంధిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ వర్షాకాలంలో వేడిచేసిన నీటితో పాటు వేడిగా ఉన్న ఆహార పదార్థాలనే సాధ్యమైనంత వరకు తీసుకోవాలని ఆయన సూచించారు. అత్యవసర సహాయానికి 040-24651119, 99085 95817 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ధర్మతేజ, సిద్ధమ్మ, లక్ష్మీసుధా, చంద్రకళ, కళావతి, సుజాత పాల్గొన్నారు.



గుడిబండలో నిల్వ ఉన్న నీటిని పారబోయిస్తున్న డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి, వైద్యురాలు



మఠంపల్లి మండలం యాతవాకిల్ల వద్ద వేములూరు రిజర్వాయర్ నుంచి ప్రవహిస్తున్న నీరు

ఎటు చూసినా వరదే..

- జిల్లాలో బుధవారం రాత్రంతా భారీ వర్షం
- సగటున 15.31 సెంటీమీటర్లు నమోదు
- అత్యధికంగా తిరుమలగిరి మండలంలో 18.42.. అత్యల్పంగా మేళ్లచెరువులో 1.35 సెంటీమీటర్ల వర్షపాతం
- ఉధృతంగా అలుగుపోస్తున్న చెరువులు, కుంటలు
- నీట మునిగిన పంటపొలాలు
- స్తంభించిన రాకపోకలు

సూర్యాపేట : ఆకాశానికి చిల్లు పడిందా అన్న రీతిలో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షం పడింది. బుధవారం సాయంత్రం మొదలైన వర్షం తెల్లవార్లూ ఏకధాటిగా కుండపోతగా కురిసింది. ప్రధానంగా తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా భారీగా వర్షం కురవగా మిగతా చోట్ల కాస్తతగ్గింది. జిల్లా వ్యాప్తంగా 15.31 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తిరుమలగిరిలో 18.42, అత్యల్పంగా మేళ్లచెరువులో 1.35 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. దీంతో గురువారం లోతట్టు ప్రాంతాలే కాకుండా రహదారులు, పంట పొలాలన్నీ జలమయమయ్యాయి. ఏరులు, వాగులు, చెరువు, అలుగులు ఉధృతంగా ప్రవహించడంతో జన జీవనం స్తంభించిపోయింది. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు గురువారం కాస్త తెరిపి నివ్వడం ఊరటనిచ్చింది.



సూర్యాపేట - దంతాలపల్లి మార్గంలో గుండ్ల సింగారం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద

- ఆత్మకూర్ (ఎస్) మండలంలో ఏపూరు శివారులో గల బిక్కేరు బ్రిడ్జి పైనుంచే 6 ఫీట్ల ఎత్తులో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. నశీంపేట శివారులో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో చివ్వెంల - ముకుందాపురం రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. పాతర్లపహాడ్‌లో అయ్యవారికుంట తండా చెరువు నుంచి శంభుని చెరువులోకి వరద నీరు వచ్చే కరకట్ట ముదిరాజ్ కాలనీ వద్ద బుధవారం అర్ధరాత్రి తెగిపోయి కాలనీలోకి నీరు చేరింది. నశీంపేట వద్ద తెగిపోయిన రోడ్డును జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. ఆత్మకూర్‌లో భీమునికుంట అలుగుపోయడంతో దుబ్బగూడెంలోని పలు ఇళ్లు నీటమునిగాయి.

అతలాకుతలం..

- అర్వపల్లి మండలం పోలీస్‌స్టేషన్ రోడ్డులోని ఇళ్లు, దుకాణాలు జలమయం అయ్యాయి. కోడూరు, కొమ్మాల రూట్లలో రాకపోకలకు అంతరాయం కలిగింది. జాజిరెడ్డిగూడెం శివారులోని మూసీనది ఉధృతంగా ప్రవహిస్తోంది.
- కోదాడలోని పెద్ద చెరువు అలుగుపోస్తోంది.
- చివ్వెంల మండలంలోని పలు గ్రామాల్లో పత్తి పంట నీటమునిగింది.
- తిరుమలగిరి మండలంలో ఈ సీజన్‌లోనే అత్యధికంగా బుధవారం రాత్రి వర్షం కురిసింది. భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. చెరువులు, కుంటలు అలుగులు పోస్తున్నాయి. తాటిపాముల, అనంతారం గ్రామాల నుంచి వెళుతున్న బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రైతుల మోటార్లు కొట్టుకుపోయాయి. ఈదురుగాలులకు చాలా చోట్ల చెట్లు నేలకొరిగాయి. తొండ, వెలిశాల గ్రామాల్లో 4 విద్యుత్ స్తంభాలు కూలడంతో కరెంటు సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.
- నడిగూడెం మండలంలో చౌదరి చెరువు, సారంగేశ్వరస్వామి చెరువు, రత్నవరం, రామాపురం, చాకిరాల, వల్లాపురం, బృందావనపురం, వేణుగోపాలపురం చెరువులకు నీరు చేరుతోంది. తెల్లబెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి నీరు చేరింది.
- మోతె మండలంలో కూడలిలో పెద్ద వాగుకు భారీగా వరద రావడంతో సంగమేశ్వర దేవాలయం చుట్టూ నీరుచేరింది. పలు గ్రామాల్లో వందల ఎకరాల్లో వరి, పత్తి పంటలు నీటమునిగాయి. వరద తాకిడికి మోటార్లు, స్టార్టర్లు, పైపులు కొట్టుకుపోయాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నీట మునిగాయి. ఈ వాగు గుండా పాలేరు రిజర్వాయర్‌లోకి భారీగా వరద చేరుతోంది. పాలేరు రిజర్వాయర్‌కు చుట్టుపక్కల ఉన్న కూడలి, రావికుంటతండా, నర్సింహాపురం, తుమ్మగూడెం, నేరడవాయి, ఉర్లుగొండ, అన్నారుగూడెంలో పంట పొలాలు మునిగిపోయాయి.

12 గంటల వ్యవధిలో..

జిల్లా వ్యాప్తంగా బుధవారం రాత్రి 8:30 గంటల నుంచి గురువారం ఉదయం 8:30 గంటల వరకు అంటే 12 గంటల వ్యవధిలోనే ఏకధాటిగా 15.31 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావడం విశేషం. ఇందులో తిరుమలగిరి మండలంలో 18.42, నాగారంలో 15.27 నూతనకల్‌లో 14.12, తుంగతుర్తిలో 12.40, జాజిరెడ్డిగూడెంలో 11.73, మద్దిరాల మండలంలో 11.23 సెంటీమీటర్ల చొప్పున వర్షం పడింది. ఇక ఆత్మకూరు (ఎస్) మండలంలో 9.62, మోతెలో 8.08, చివ్వెంలలో 5.85, సూర్యాపేటలో 5.79, నడిగూడెంలో 4.7, అనంతగిరిలో 4.36, మునగాలలో 4.05, కోదాడలో 3.84, పెన్‌పహాడ్ లో 3.72, గరిడేపల్లిలో 3.51, హుజూర్ నగర్‌లో 3.36, నేరేడుచర్లలో 2.90, పాలకవీడులో 2.84, మఠంపల్లిలో 2.0, చిలుకూరులో 1.88, చింతలపాలెంలో 1.55, మేళ్లచెరువు మండలంలో 1.35 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.

- నూతనకల్ మండలం గుండ్లసింగారం శివారులోని పాలేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. నూతనకల్-చిల్పకుంట్ల రహదారి నీటమునిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నూతనకల్‌లో ప్రధాన రహదారి వెంట ఉన్న ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి నీటిని బయటికి తరలించారు.



అర్వపల్లిలో వర్షపు నీరు నిలిచిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

- మఠంపల్లి మండలంలో యాతవాకిల్ల వద్ద గల వేములూరు రిజర్వాయర్ అలుగు పోస్తోంది.
- తుంగతుర్తి మండలంలోని సంగెం బంధం వద్ద నీటి ప్రవాహం అధికంగా ఉండి రాకపోకలు నిలిచిపోయాయి. చిత్తలూరి బంధం కారణంగా వెలుగుపల్లి - కేశవాపురం మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.
- సూర్యాపేట పట్టణంలో లోతట్టు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటించారు. అక్కడక్కడ కాలనీల్లో నిలిచిన నీటిని జేసీబీల సాయంతో దగ్గరుండి తొలగింపజేశారు.



ఆత్మకూర్ (ఎస్) మండలం పాతర్లపాడు గ్రామంలో ఇళ్ల మధ్య నుంచి ప్రవహిస్తున్న నీరు



అలుగు పోస్తున్న కోదాడ పెద్ద చెరువు



ఆత్మకూర్ (ఎస్) మండలం నశీంపేట సమీపంలో బ్రిడ్జి పనులు కొనసాగుతున్న చోట తెగిన డైవర్షన్ రోడ్డు



నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి బ్రిడ్జి వద్ద మూసీని పరిశీలిస్తున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్



చిలుకూరు: నారాయణపురంలో వలకు చిక్కిన చేప

పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణపై దృష్టి పెట్టాలి

- జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నియోజక వర్గాల వారీగా వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పేర్ల మార్పు, పాత పోలింగ్ కేంద్రాల మార్పులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే నాయకులు తెలియజేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిశీలనకు టీమ్స్ పంపిస్తామన్నారు. జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎ. వెంకట రెడ్డి, తహసీల్దార్ వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నుంచి చకిలం రాజేశ్వర రావు, సీపీఎం నుంచి కోటా గోపి, బీఆర్ఎస్ నుంచి దేవర శెట్టి సత్యనారాయణ , బీఎస్పీనుంచి స్టాలిన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి వెంకట్రావు

కోదాడ డిపోలో టీ9(30) టికెట్

కోదాడఅర్బన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30కిలోమీటర్ల లోపు ప్రయాణించే ప్రయాణికుల కోసం టీఎస్ఆర్టీసీ టీ9టికెట్‌లను ప్రవేశ పెట్టిందని కోదాడ డిపో మేనేజర్ దేవులపల్లి శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. టికెట్ విలువ రూ.50గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి రాత్రి 9 గంటల లోపు రూ. 50లు చెల్లించి రాను పోను ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ టికెట్‌లు పల్లె వెలుగు బస్సుల్లో చెల్లుబాటు అవుతాయని పేర్కొన్నారు. వీటిని కండక్టర్‌ల వద్ద తీసుకోవాలని సూచించారు. కాగా తిరుగు ప్రయాణంలో రూ. 20లు చెల్లించి ఎక్స్‌ప్రెస్ బస్సులో ప్రయాణించవచ్చని ఆయన తెలిపారు. ఈ టికెట్‌ల వల్ల ప్రయాణికులకు రూ. 10 నుంచి రూ. 30 వరకు ఆదా అవుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రీనరీ పనులు వేగవంతం చేయాలి

- మంత్రి జగదీష్‌రెడ్డి ఆదేశం

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో కొనసాగుతున్న గ్రీనరీ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సూర్యాపేట పట్టణంలో సుందరీకరణ పనులు, మెడికల్ కాలేజీ, సద్దుల చెరువు మినీ ట్యాంక్ బండ్ తదితర ప్రాంతాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్టీఆర్ చౌరస్తా, జనగామ క్రాస్ రోడ్‌లో ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పచ్చదనం ఉట్టిపడేలా చౌరస్తాలను తీర్చిదిద్దాలని ఆదేశించారు. పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో స్వల్పంగా దెబ్బతిన్న ఎన్టీఆర్ పార్క్ వద్ద గల రహదారులను వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులు సూచించారు. మెడికల్ కాలేజీ హాస్టల్ విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా మరో గేటును ఏర్పాటు చేయాలన్నారు.



జనగామ క్రాస్‌రోడ్డులో పనులు పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి

సమస్యలు పరిష్కరించే దాకా సమ్మె



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన పంచాయతీ కార్మికులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సమస్యలు పరిష్కారం అయ్యేదాకా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి, జేఏసీ కన్వీనర్ నెమ్మాది వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని గ్రామ పంచాయతీ కార్మికులు గురువారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2020 నుంచి ఇప్పటి వరకు గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. వారాంతపు సెలవులు, ప్రమాద బీమా, చనిపోయిన కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా, కుటుంబానికి ఉద్యోగం, రిటైర్‌మెంట్ బెన్ఫిట్స్ రూ. 10 లక్షలు, జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్ వెంకట్రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. రాంబాబు, గ్రామ పంచాయతీ జేఏసీ నాయకులు రాధాకృష్ణ, లింగయ్య, సైదులు, ముత్తయ్య, చిమట నాగరాజు, సురేష్, రవిచంద్ర, సైదులు, శీలం శ్రీను, వట్టేపు సైదులు, శ్రీశైలం పాల్గొన్నారు.

పంచాయతీల్లో నగదు రహితం!

- పన్నుల చెల్లింపునకు యూపీఐ సేవలు
- అందుబాటులోకి తేవాలని కేంద్రం నిర్ణయం
- ఆగస్టు 15 నుంచి అమలు

నాగారం: గ్రామ పంచాయతీల్లో పన్నులు వసూలవుతున్నాయా.. వసూలైనవి ఏమవుతున్నాయి.. లెక్కలు చెప్పడం కష్టమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు పంచాయతీల బలోపేతానికి డిజిటల్ పరంగా మరింత ముందుకు నడిపించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాయి. పంచాయతీల్లో ప్రధానంగా పన్నులను ప్రజలు నగదు రూపంలో చెల్లించేవారు. కానీ ప్రస్తుతం సాంకేతికత పరుగులు పెడుతున్న క్రమంలో కూరగాయలు మొదలుకొని ఇతర వస్తువుల కొనుగోలు సైతం స్మార్ట్ ఫోన్ ద్వారా యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్) సేవలను ప్రజలు వినియోగిస్తున్నారు. దీంతో పంచాయతీల్లో సైతం యూపీఐ సేవలు అందుబాటులోకి తేవాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 15వ తేదీ నుంచి దీని అమలు చేయనున్నారు.

పక్కదారి పట్టకుండా..

జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మేజర్, పెద్ద పంచాయతీలో వివిధ రకాల అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపులు కొన్ని పత్రాల జారీకి ఆన్‌లైన్ పేమెంట్స్ వినియోగంలో ఉన్నాయి. చాలా పంచాయతీల్లో పన్నుల వసూలు మాత్రం ఇప్పటికీ నగదు రూపంలోనే చేస్తున్నారు. దీని కారణంగా వసూలైన పన్నులు వివిధ అభివృద్ధి పనులు లేదా ఇతర ఖర్చుల పేరుతో పద్దులు రాసి పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. తాజాగా కేంద్ర నిర్ణయం వల్ల ఇక ముందు పన్నుల వసూలు, పత్రాల జారీకి పంచాయతీల్లో యూపీఐ ద్వారా చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. దీని కారణంగా పూర్తిగా పంచాయతీ వ్యవస్థ అన్నది పారదర్శకం కానుంది. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం పంచాయతీలకు తగిన సర్వీస్ ప్రొవైడర్లను ఎంపిక చేసుకోనున్నారు. ఈ విషయంపై త్వరలో జిల్లా మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిసింది. పంచాయతీ వ్యవస్థలో పూర్తిస్థాయిలో అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ఈ విధానంతో అవకాశం ఉంటుంది.



నాగారంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం

డిజిటల్ చెల్లింపులతో పారదర్శకత పెరుగుతుంది



"యూపీఐతో పంచాయతీల్లో నగదు రహిత సేవలు అందుబాటులోకి వస్తే వ్యవస్థ పారదర్శకంగా మారుతుంది. పంచాయతీ సేవలు ప్రజలకు వేగవంతంగా అందుతాయి. ఇప్పటికే యూపీఐ సేవలపై కసరత్తు జరుగుతోంది. త్వరలోనే అమల్లోకి రానుంది.

– సాంబిరెడ్డి, డీఎల్‌పీఓ సూర్యాపేట

పెరిగిన డిజిటల్ సేవలు..

కరోనా తర్వాత నుంచి మారుమూల పల్లెల్లోనూ యూపీఐ సేవలు విస్తరించాయి. చిన్న దుకాణాలు మొదలుకొని చిరు వ్యాపారి వరకు యూపీఐ సేవలను వినియోగిస్తున్నారు. చిల్లర చెల్లింపులకు సైతం దీన్నే వాడుతున్నారు. ప్రతి ఒక్కరి దగ్గర స్మార్ట్ ఫోన్ ఉండడంతో మారుమూల గ్రామాల్లో ఈ సేవలు విస్తరించాయి. ఇందులో భాగంగానే ప్రజలకు సులువుగా మరింత దగ్గర అయ్యేందుకు నగదు రహిత చెల్లింపులకు ప్రతి పంచాయతీలో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే దీనిపై పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ అమలుకు ఉత్తర్వులు ఇచ్చింది.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో మేకల కాపరి మృతి


వెంకటేశ్వర్లు మృతదేహం

మోతె: విద్యుదాఘాతంతో మేకల కాపరి మృతిచెందిన ఘటన మోతె మండల పరిధిలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామానికి చెందిన ఇరిగి వెంకటేశ్వర్లు(30) గురువారం ఉదయం తన మేకలను ఇంటి నుంచి తోలుకొని వెళ్లి వ్యవసాయ క్షేత్రంలో మేపుతున్నాడు. ఈ సమయంలో మేకలకు మేత కోసం చెట్టు కొమ్మలు నరుకుతుండగా పక్కనే ఉన్న ఫెన్సింగ్‌కి తగలగా.. దానికి కరెంట్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు గమనించి మృతుడి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేయడంతో వారు పోలీసులు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బుద్ధవనం ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెబుతా

- బాలీవుడ్ నటుడు గగన్‌మాలిక్


గగన్‌మాలిక్‌కు మెమొంటో అందజేస్తున్న బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య

నాగార్జునసాగర్: బుద్ధవనం తనను ఎంతగానో ఆకట్టుకుందని, బుద్ధవనం ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెపుతానని బాలీవుడ్ నటుడు, మాజీ క్రికెటర్ గగన్‌మాలిక్ అన్నారు. నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించి, సన్మానించారు. సిద్దార్థ గౌతమ అనే చిత్రంలో నటించి ఉత్తమ నటుడిగా అవార్డు పొందడమే గాక, జీ టీవీ రామాయణం సీరియల్‌లోని రాముని పాత్రలో రాణించినట్లు తెలిపారు. బుద్ధవనంలోని జాతకవనం, ధ్యానవనం, శ్రీలంక బుద్ధవిగ్రహం, స్థూపవనం, మహాస్థూపం చుట్టూ అలంకరించిన బౌద్ధ శిల్పాల గురించి బుద్ధవనం కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి గగన్‌మాలిక్‌కు వివరించారు. బుద్ధవనంలో చిత్రాలు తీయడానికి బాలీవుడ్, టాలీవుడ్ నిర్మాతలతో చర్చిస్తానని గగన్‌మాలిక్ పేర్కొన్నారు. వారి వెంట కార్యక్రమంలో బుద్ధవనం ఓఎస్డీ సుధీర్‌రెడ్డి, డిజైన్ ఇంఛార్జ్ శ్యాంసుందర్‌రావు ఉన్నారు.

వానలు.. వరదలు


యాదగిరిగుట్ట పట్టణంలోని గండి చెరువు నిండి యాదగిరిపల్లిలోని పొలాల్లోకి వెళ్తున్న వర్షం నీరు


గుండాల: అలుగు పోస్తున్న నూనెగూడెం పెద్ద చెరువు


మోటకొండూరు: అమ్మనబోలు-గొలనుకొండ మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్ద వాగు


నూతనకల్: గుండ్లసింగారం బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న పాలేరు వాగు


మోత్కూరు మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బిక్కేరు వాగు


అర్వపల్లిలోని పోలీస్ స్టేషన్ రోడ్డులో జలమయమైన ఇళ్లు


అడ్డగూడూరు: గోవిందాపురం వద్ద వాగులో కొట్టుకుపోతున్న బైక్‌ను తీస్తున్న స్థానికులు


రాజాపేట: దూదివెంకటాపురం వద్ద కల్వర్టుకు అడ్డంగా బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు


మోతె: కూడలి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్ద వాగు


తిరుమలగిరి(తుంగతుర్తి): అనంతారంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బిక్కేరు వాగు


ఆత్మకూర్(ఎస్): నసీంపేట వద్ద వరద ధాటికి కోతకు గురైన తాత్కాలిక రోడ్డు


ఆత్మకూరు(ఎస్)లో శంభుని చెరువు అలుగు పోస్తుండడంతో చేపలు పడుతున్న గ్రామస్తులు


ఆలేరు పట్టణంలోని 11 వార్డులో నీట మునిగిన ఇళ్లు


భువనగిరి మండలం వడపర్తి కత్వ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న రాచకాల్వ

మూసీ ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో


మూసీ ప్రాజెక్టు ఎనిమిది గేట్లు ఎత్తడంతో దిగువకుపోతున్న నీరు

- ఎనిమిది గేట్ల ద్వారా నీటి విడుదల

కేతేపల్లి: హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. గురువారం ఉదయానికి ప్రాజెక్టుకు 25,489 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో పెరిగింది. అధికారులు ఎనిమిది క్రస్టు గేట్లను ఐదు అడుగుల మేర పైకెత్తి 25,207 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 282 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో అధికారులు ప్రాజెక్టు వద్దే మకాం వేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మూసీ రిర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.89 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- వారం రోజుల్లో ఆస్ట్రేలియాకు.. ఇంతలోనే ప్రమాదం
- తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన మరో యువ డాక్టర్
- బైక్‌పై వెళ్తుండగా ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం


సట్టు మహేష్ (ఫైల్)

నల్లగొండ క్రైం: మరో వారం రోజుల్లో ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియాకు వెళ్లాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఇదే ప్రమాదంలో మరో యువ డాక్టర్ తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లాడు. ఈ ఘటన బుధవారం రాత్రి నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డులో వైఎస్ఆర్ సర్కిల్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ సట్టు సైదులు, నాగమణి దంపతులు ఉద్యోగ రీత్యా నల్లగొండ పట్టణంలోని పద్మావతి కాలనీలో అద్దెకు ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు సట్టు మహేష్(25) ఉన్నత చదువుల నిమిత్తం ఆస్ట్రేలియాకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. మహేష్‌కు పట్టణంలోని బోయవాడకు చెందిన బత్తుల ముత్యాల్‌రావు కుమారుడు రాజు చిన్నప్పటి నుంచి స్నేహితుడు. రాజు చెన్నైలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. మహేష్, రాజు ఇద్దరూ కలిసి బుధవారం రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై నల్లగొండ పట్టణ శివారులోని సాగర్ రోడ్డులో ఉంటున్న తమ స్నేహితుడి వద్దకు వెళ్లి రాత్రి 9గంటల సమయంలో తిరిగి నల్లగొండ పట్టణంలోకి వస్తున్నారు. అదే సమయంలో వైఎస్ఆర్ సర్కిల్ వద్ద గుర్తుతెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టగా.. మహేష్ డివైడర్‌పై పడడంతో తలకు తీవ్రగాయమై అవస్మారక స్థితిలోకి వెళ్లాడు. బైక్ నడుపుతున్న రాజు తలకు తీవ్రగాయాలు కాగా అతడు వెంటనే తేరుకొని రోడ్డు వెంట వచ్చే వాహనాలను ఆపుతుండగా.. వారి వెనకే వచ్చిన వాహనదారుడు రోడ్డు అడ్డంగా నిలబడి వాహనాలను ఆపసాగాడు. అదే సమయంలో ఓ కారు డ్రైవర్ వారిని గుర్తించి హుటాహుటిన పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. కాగా అప్పటికే మహేష్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన రాజు కోమాలోకి వెళ్లగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

మరో వారంలో జీవితంలో స్థిరపడే వారు..

మరో వారంలో మహేష్ ఉన్నత చదువుల నిమిత్తం ఆస్ట్రేలియాకు వెళ్లేందుకు అంతా సిద్ధం చేసుకున్నాడు. చెన్నైలో వైద్య విద్యను పూర్తిచేసిన బత్తుల రాజు సైతం మరో వారం రోజుల్లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఉద్యోగంలో చేరాల్సి ఉంది. చేతికందొచ్చిన కుమారుడు మృతిచెందడంతో మహేష్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోస్టుమార్టం అనంతరం స్వ గ్రామం వల్లాలలో మహేష్ అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నగదు చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

- రూ. 14 లక్షల నగదు, స్కూటీ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర


నిందితుడు వెంకటేష్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి, బొమ్మలరామారం: కారులో పెట్టిన రూ.14లక్షలు దొంగిలించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర భువనగిరి పట్టణంలోని డీసీపీ క్యాంపు కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామానికి చెందిన దొమ్మాటి శంకర్ బొమ్మలరామారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రైవేట్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అతడి వద్ద ఇదే మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన తుడుం వెంకటేష్ పనిచేస్తున్నాడు. వెంకటేష్ ప్రతిరోజు శంకర్ ఇంటికి వెళ్లి మధ్యాహ్నం భోజనం తీసుకువస్తుంటాడు. ఇటీవల శంకర్ తనకు సంబంధించిన 20 గుంటల భూమిని హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తికి విక్రయించాడు. భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి బుధవారం ఉదయం శంకర్‌కు రూ.14 లక్షలు నగదు తెచ్చి ఇచ్చాడు. నగదును తీసుకున్న శంకర్ కార్యాలయం ఆవరణలో ఉన్న తన కారు డిక్కీలో పెట్టి తాళం వేసుకున్నాడు. ఇదంతా గమనించిన వెంకటేష్ రోజుమాదిరిగా మధ్యాహ్నం భోజనం తీసుకురావడం కోసం శంకర్ ఇంటికి వెళ్లాడు. ఈ సమయంలో భోజనంతో పాటు ఇంట్లో ఉన్న కారు డూప్లికేట్ తాళాన్ని తీసుకొని కార్యాలయానికి వచ్చి భోజనాన్ని ఇచ్చాడు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఉన్న కారు వద్దకు వెళ్లి తన వెంట తెచ్చుకున్న డూప్లికేట్ తాళంతో కారు డిక్కీని ఓపెన్ చేసి అందులో ఉన్న రూ. 14లక్షల నగదును దొంగిలించి తన స్కూటీలో పెట్టుకుని అక్కడి నుంచి పారిపోయాడు. సాయంత్రం విధులు ముగించుకొని శంకర్ కారు వద్దకు వచ్చి చూడగా డిక్కీలో నగదు కనిపించలేదు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు గురువారం రంగాపురం గ్రామ చౌరస్తా వద్ద వెంకటేష్‌ను పట్టుకొని విచారించగా తానే దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. నిందితుడి వద్ద రూ.14లక్షల నగదుతో పాటు స్కూటీని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. 24 గంటల్లోనే ఈ కేసును ఛేదించిన ఎస్‌హెచ్‌ఓ ఏఎస్పీ శివం ఉపాధ్యాయను డీసీపీ అభినందించారు. సమావేశంలో రూరల్ సీఐ బి. సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతోనే ప్రైవేట్ బస్సులో చోరీ

- రూ.28లక్షలు చోరీ చేసేందుకు ముందస్తుగానే ప్లాన్ చేసిన నిందితులు
- బస్సు కోసం ముందుగానే కారులో వచ్చి హోటల్ వద్ద ఎదురుచూపు
- చోరీ చేసిన నగదు బ్యాగులను మరో ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు తరలింపు
- హోటల్ వద్ద సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి శివారులో జాతీయ రహదారి పక్కన ఓ హోటల్ ముందు నిలిపిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో నుంచి బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు రూ.28లక్షలు చోరీ చేసిన విషయం తెలిసిందే. అయితే పక్కా ప్రణాళికతోనే నిందితులు ఈ చోరీకి ప్లాన్ చేసినట్లు హోటల్ వద్ద సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల ద్వారా తెలుస్తోంది. వివరాలు.. హైదరాబాద్ శివారు మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని కృష్ణాకాలనీ చెందిన సుశాంత్‌కుమార్ పాండా తాను నిర్వహించే ప్లాస్టిక్ సామగ్రి వ్యాపారంలో భాగంగా ఇటీవల ఒరిస్సా రాష్ట్రంలోని బరంపూర్ ప్రాంతానికి వెళ్లి తనకు రావాలస్సిన రూ.28లక్షలను వసూలు చేసుకోని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో బుధవారం ఉదయం 8గంటల సమయంలో బస్సు డ్రైవర్ నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లి సమీపంలో హైవే పక్కన గల పూజిత హోటల్ వద్ద టిఫిన్ కోసం బస్సును నిలిపాడు. డబ్బు ఉన్న రెండు బ్యాగులను బస్సులోనే తన సీట్లో ఉంచిన పాండా టిఫిన్ చేసేందుకు కిందకు దిగాడు. కొద్దిసేపటి తర్వాత వచ్చి చూసేసరికి డబ్బు ఉన్న బ్యాగులు కనిపించకపోవడంతో బస్సు డ్రైవర్, హోటట్ యజమాని సహకారంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకొని బస్సు డ్రైవర్, బస్సును పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అందులో ప్రయాణిస్తున్న 27మందిని విచారించారు. హోటల్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో నిందితుల దృశ్యాలు రికార్డయ్యాయని, వారిని పట్టుకునేందుకు 4టీంలతో గాలిస్తున్నట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

సీసీ కెమెరాల్లో చోరీ దృశ్యాలు..

కాగా సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల ప్రకారం.. బస్సు హోటల్ వద్దకు వచ్చే కంటే కొంచెం ముందే ఓ కారు అక్కడకు వచ్చింది. ఆ తర్వాత ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హోటల్ వద్దకు రాగా.. అందులోని ప్రయాణికులు దిగిన తర్వాత కారులోని ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు బస్సులోకి వెళ్లి రెండు బ్యాగులను బయటికి తీసుకొచ్చి విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఆపి అందులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి రెండు బ్యాగులు ఇచ్చాడు. ఆ తర్వాత కారులో వచ్చిన వారు హైదారాబాద్ వైపు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది.

గతంలోనూ ఇలాంటి ఘటనలు..

→ పూజిత హోటల్ వద్దే గతంలోనూ ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో నుంచి 130 తులాల బంగారం చోరీ జరిగింది. 22 నవంబర్, 2022న చెన్నై నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అల్పాహారం కోసం పూజిత హోటల్ వద్ద ఆపగా.. ప్రయాణికులు దిగిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు బస్సులోకి చొరబడి అందులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడికి చెందిన 130 తులాల బంగారం చోరీ చేశారు.

→ అదేవిధంగా 4 జూలై, 2019న నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు విజయవాడ నుంచి హైదారాబాద్ వెళ్తుండగా.. డ్రైవర్ పూజిత హోటల్ వద్ద అల్పాహారం కోసం ఆపాడు. ప్రయాణికులు దిగిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు బస్సులోకి వెళ్లి రూ.10లక్షల నగదు బ్యాగును చోరీ చేశారు. కాగా ఈ రెండు ఘటనల్లో పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ.. అప్పట్లో ఆ హోటల్ వద్ద సీసీ కెమెరాలు లేకపోవడంతో నిందితులను ఇప్పటివరకు గుర్తించలేదని తెలుస్తోంది.

యాదాద్రిని సందర్శించిన బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్


డిప్యూటీ హై కమిషనర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న అధికారి

సాక్షి, యాదాద్రి, యాదగిరిగుట్ట : బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఒవెన్ గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌ను సందర్శించారు. కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి పరిపాలన గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి మొక్కను అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు జిల్లాలో అమలవుతున్న తీరును హై కమిషనర్‌కు కలెక్టర్ పమేలా సత్పతి వివరించారు. అనంతరం బ్రిటీష్ హైకమిషనర్ గారెత్ విన్ ఒవెన్ యాదగిరిగుట్టకు వెళ్లి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.